# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 137 క్రిష్ణా, బుధవారం 11 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జ్‌లు
- నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## వీరమ్మ తల్లి తిరునాళ్ళ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో అన్నదానం : వై వి బి ఆర్





**ఉయ్యూరు, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** వీరమ్మ తల్లి తిరునాళ్ళకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు తెదేపా యువ నాయకులు యారలగడ్డ సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు వై వి బి రాజేంద్ర ప్రసాద్ (వై వి బి ఆర్) ప్రారంభించారు. అనంతరం

సిడిబండి ఉత్సవంలో బుట్టలో ఊరేగే వివాహానికి సిద్ధంగా ఉన్న దళిత యువకుని గృహానికి వెళ్లి కాబోయే పెళ్లి కుమారుడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..., రాష్ట్రంలోనే ప్రసిద్ధి గానించిన ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ళకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలనుండి భక్తులు వస్తారని వారికి టీడీపీ యువనాయకులు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ రోజు సిడిబండి ఉత్సవం ఉన్నందున వేలాదిగా పాల్గొనే భక్తులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ మాజీ చైర్మన్ జంపాన పూర్ణ చంద్రరావు, యనిగల్ల కుటుంబరావు, చిరంజీవి, జంపన శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్, రత్నం బుజ్జి, బొప్పన ప్రసాద్, కార్తికేయ, మెరుగు కోటయ్య, నరేశ్, శివ, సలోమీ, చలపాతి శ్రీను బాబి, నాగరాజు, భాగ్యరాజు, మేజర్ శివ సుజీత్ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జీ.ఎస్.ఆర్.చౌదరి కి సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు



**గుంటూరు, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** దివంగత సూపర్ స్టార్ కృష్ణ అభిమానిగా అందరికి సుపరిచితులైన గుమ్మడి సీతారామయ్యచౌదరి కి ఎఫ్.టీ.పీ.సి ఇండియా ( ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు ని అందచేసింది. ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ ఇటీవల సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డుల ఫంక్షన్ ను హైదరాబాద్ లో నిర్వహించగా, అనివార్య కారణాల వల్ల ఆ ఫంక్షన్ కు సీతారామయ్యచౌదరి హాజరు కాలేకపోవటంతో, ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ ప్రతినిధులు మంగళవారం స్వయంగా గుంటూరు కన్నావారితోటలోని జి.ఎస్.ఆర్.చౌదరి ఇంటికే వచ్చి అవార్డును బహుకరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సినీ నిర్మాత వీస్ విజయ్ వర్మ పాకలపాటి, సంయుక్త కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, సినీ గేయ రచయిత తైదల బాపు అవార్డు మెమొంటోతో పాటు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని జి.ఎస్.ఆర్.చౌదరికి అందజేసారు. నిజమైన కృష్ణ అభిమానిని గుర్తించాలనే ఈ అవార్డు కి సీతారామయ్యచౌదరి పేరుని కమిటీ గుర్తించిందని కార్యదర్శి విజయ్ వర్మ తెలిపారు. కృష్ణ జీవిత చరిత్ర ను సంపూర్ణంగా సేకరించిన ఘనత ఆయనదేనన్నారు. రచయత తైదల బాబు మాట్లాడుతూ..., కృష్ణ అభిమానిగా సీతారామయ్య చేసిన సేవలను ప్రస్తుతించారు. సినీ అభిమానులకు ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఈ అవార్డుతో కృష్ణ అభిమానిగా తన జీవితం ధన్యమైందని , ఈ అవార్డు అందించిన ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి విజయ్ వర్మ లకు సీతారామయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

## లోకమాత ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి : దేవినేని అవినాష్

**విజయవాడ, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** విజయవాడ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుణదల మేరీ మాత (లుర్ధుమాత) 102 వార్షిక మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన మేరీ మాత ఊరేగింపు కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు – కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి క్షేత్రానికి చేరుకున్న దేవినేని అవినాష్‌కు ఫాదర్ జయరాజు మరియు చర్చి కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాత రథం వద్ద కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును అధికారికంగా ప్రారంభించారు.

శోభాయమానంగా అలంకరించిన మాత రథం వెనుక వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కలిసి ఆయన నడిచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆశీస్సుల కోసం ప్రార్ధన చేశారు. అనంతరం దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడుతూ..., లోకమాత మేరీ మాత ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని.. మన ప్రియతమ నేత, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ఆ మాత దీవెనలు మెండుగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించాను," అని ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు లక్షలాదిగా



తరలిరావడంతో గుణదల కొండ ప్రాంతం జనసంద్రంగా మారింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు మరియు పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఫాదర్ జయరాజు మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకునే ఈ ఉత్సవం శాంతి సౌభ్రాతృత్వాలకు ప్రతీక అని కొనియాడారు.

## టీటీడీ లడ్డూ కల్తీ నెయ్యి కేసులో ఈడీ ఎంట్రీ..

**క్రైం కౌంటర్ న్యూస్,** తిరుమల, ఫిబ్రవరి 10: శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ అక్రిడిటేషన్ : కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ అక్రిడిటేషన్ మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ లో వారి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ జీవో నెం. 84 లోని నిబంధనల ప్రకారం 308 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేశామన్నారు. ఇంకా అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి, వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఈనెల 24వ తేదీన జరిగే మూడో విడత సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషనులు మంజూరు కానీ పాత్రికేయులు వారి అర్హతకు సంబంధించి ఆధార పత్రాలు, అనుబంధ పత్రాలు జతపరచి మరల సమర్పించిన యెడల పరిశీలించి అక్రిడిటేషనులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా ఉన్న వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులు, మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్.

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 10 :** ఏపీలోని విద్యార్థులకు కూటమి సర్కార్ భారీ గుడ్‌న్యూస్ అందించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఒకేసారి విడుదల చేసింది. దాదాపు రూ.1200 కోట్ల బకాయిలను మంగళవారం విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా విద్యార్థులకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల కొన్ని విద్యాసంస్థలు పరీక్షల హాల్ టికెట్లను ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు కోర్సు పూర్తైన తర్వాత సర్టిఫికేట్లు కూడా అందించడం లేదు.

బకాయిలు విడుదల

ఈ క్రమంలో కాలేజీలు విద్యార్థులకు హాల్ టికెట్లు, సర్టిఫికేట్ల విషయంలో ఇబ్బందులు పెట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం బకాయిలను ఇవాళ విడుదల చేసింది. ప్రస్తుతం రూ.7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో రూ.1200 కోట్లను తాజాగా విడుదల చేసింది. వైసీసీ ప్రభుత్వం నుంచి ఈ బకాయిలు పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరకొరగా అప్పుడప్పుడు విడుదల చేయగా.. ఇప్పుడు ఒకేసారి పెద్ద మొత్తంలో విడుదల చేసింది. ఇప్పుడు ఎట్టకేలకు ప్రభుత్వం విడుదల చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరికి రూ.20 వేలు

కాగా పోస్ట్ మెట్రిక్ కోర్సులు చేసే విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తోంది. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు అందిస్తున్నారు. కాలేజీలకు వీటిని అందిస్తున్నారు. ఇక ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ ఆపైన విద్యార్థులకు రూ.20 వేలు ట్యూషన్, హాస్టల్ ఖర్చుల రూపంలో తల్లిదండ్రుల అకౌంట్లో జమ చేస్తున్నారు. గత కొంతకాలంలగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉండటంతో ఎప్పుడెప్పుడు విడుదల అవుతాయా అని విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు వేచి చూస్తున్నాయి. పలుమార్లు ప్రభుత్వానికి కాలేజీ యాజమాన్యాలు రిక్వెస్ట్ కూడా పెట్టుకున్నాయి. కాలేజీ నిర్వహణ ఖర్చుల కోసం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం ఎట్టకేలకు వారి డిమాండ్‌తో గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో విద్యార్థులు ఊరట కలిగినట్లయింది.

# జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## - జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** పండుగను భక్తిశ్రద్ధతో ఆచరించుకొని పోలీసు వారికి సహకరించాలని విలేకరుల సమావేశంలో తెలిపిన జిల్లా ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు. జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉన్న శైవ క్షేత్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు (ఐపీఎస్) మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా ప్రధానంగా ఏడు శైవ క్షేత్రాలు ఉన్నాయని అక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు అసంఖ్యాకంగా ప్రజలు హాజరవుతారు కనుక దానికి తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల మధ్య తోపులాట జరగకుండా ఆలయ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకొని క్రమబద్ధమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్ సదుపాయాలు, మార్గదర్శక సూచికలు, ఇతర ముఖ్యమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని దైవ క్షేత్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని కూడా నియమిస్తున్నామని వివరించారు. మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదని, ప్రజలు సహకరించి శాంతియుతంగా పండుగను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# అపూర్వ సహోదరులకు ఉత్తమ సేవా పురస్కారం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఒకరు హనుమాన్ జంక్షన్ ఎస్సై వి. సురేష్. మరొకరు పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి . సుధాకర్ వీరిద్దరూ స్వయాన అన్నదమ్ములు. అన్నదమ్ముల్లో పెద్దవాడైన సీఐ సుభాకర్ 2009 బ్యాచ్ లో ఎస్సై గా సెలెక్ట్ అయి తూర్పుగోదావరి జిల్లా కడియం లో మొదటి పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం ప్రమోషన్ పై కృష్ణ జిల్లా ఎస్ బి సిఐ గా చేసి ప్రస్తుతం పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన తమ్ముడైన హనుమాన్ జంక్షన్ ఎస్సై వి సురేష్ 2012 బ్యాచ్ ఎస్సై గా తూర్పుగోదావరి జిల్లాలోని గండేపల్లి మొదటి పోస్టింగు తీసుకున్నారు. ఇక్కడ విశేషం ఏంటంటే ఈ ఏడాది (2026) గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అన్నదమ్ములు ఒకే వేదిక మీద ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవడం విశేషం. వీరిద్దరూ కలిసి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జిల్లా కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా అన్నదమ్ములు ఇద్దరూ కలిసి గణతంత్ర పురస్కారం అందుకోవడం విశేషం. ఇద్దరు ఒకే సందర్భంలో ఒకే వేదిక మీద వేర్వేరు హోదాల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం మంచి అనుభూతి, అభినందనీయం. వారి జీవితాల్లో కూడా ఒక అనుభూతిని, ఆనందాన్ని కలిగించే సందర్భం.

# ప్రజా ప్రతినిధులకు మార్చి 5నుండి 7 వరకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు.



**అమరావతి, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** అసెంబ్లీ సమావేశాల్లో ఆటవిడుపుగా ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ప్రజా ప్రతినిధులకు క్రీడాపోటీల నిర్వహణపై సన్నద్ధతపై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., నెల రోజుల పాటు జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్చి 5,6,7 తేదీల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆటవిడుపు కలిగించాలని క్రీడలు, సాంస్కృతిక విభాగాల అధికారులకు సూచించారు. క్రీడా పోటీల విభాగంలో పాల్గొనటానికి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆసక్తి కనపర్చుతున్నారని, అంతే కాకుండా సాంస్కృతిక కార్యక్రమంలో కూడా పాల్గొనడానికి ఉత్సుకత చూపుతుండటం హర్షనీయమని అన్నారు. క్రీడల ఈవెంట్ నిర్వహణనకు శాసన సభ, శాసన మండలి చీఫ్ విప్ లు, విప్ లతో ఒక కమిటీ వేయాలన్నారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించే ప్రజాప్రతినిధుల నిర్ణయించిన మూడు రోజుల్లో క్రీడాపోటీలను మధ్యాహ్నం నుండి జరపాలన్నారు. అలాగే కల్చరల్ కార్యక్రమాలు చివరి రోజు సాయంత్రం నుండి అహ్లాదవాతావరణంలో నిర్వహించేలా కల్చరల్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ సారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబ సభ్యులతో హజరు కావాలని కోరనున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పారు.

నిర్వహించనున్న క్రీడల వివరాలు :

అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పందెం, క్యారమ్స్, చెస్, బాడ్మింటన్, టెబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, పికిల్ బాల్ పోటీలు నిర్వహించాలని ప్రాథమికంగా శాప్ అధికారులు అధికారులు స్పీకర్ అయ్యన్న పాత్రుడి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్కిట్స్, ట్రాక్ సింగింగ్ తదితర వీక్షకులను అలరించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ క్రీడాపోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహభరిత, ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉప సభాపతి కె. రఘురామ కృష్ణరాజు, రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విప్ యార్లగడ్డ వెంకట్రావ్, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే కూన రవికుమార్, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర,డైరక్టర్ ఫర్ కల్చర్ మల్లిఖార్జునరావు, శాప్ ఎండీ భరణి తదితరులు పాల్గొన్నారు.

# ఆ వ్యాఖ్యలు నా వ్యక్తిగతం.. క్షమించండి: ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి




**క్రైం కౌంటర్ న్యూస్,** విజయవాడ, ఫిబ్రవరి10 : వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, వికసిత కమలం, వికసిత కూటమి - ఇదే తమ లక్ష్యమని బీజేపీ నేత, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తిరుపతిలో కమల వికాసంపై తాను వ్యాఖ్యలు చేశానన్నారు. తాను నాలుగోసారి ఎంఎల్ఏగా గెలుపొందినట్లు గుర్తు చేశారు. తన సొంత అభిప్రాయం చెప్పానని తెలిపారు. తాను లెక్చరర్‌గా పని చేశానని.. అలాగే తాను ప్రాస మాట్లాడే వ్యక్తినని చెప్పారు. సీఎం చంద్రబాబుకు తెలియకుండా మాదే రాజ్యమని మాట్లాడే వారి కొవ్వు కరిగించాలనే తాను అలా మాట్లాడినట్లు వివరించారు.

కూటమి బలంగా ఉండాలని కోరుకునే వ్యక్తిని స్పష్టం చేశారు. తన ప్రాసను ప్రయాసగా మార్చారని.. ఇది మహా తప్పు అని పేర్కొన్నారు. ఈ కూటమిలో తమ బీజేపీ అధిక సీట్లు సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ధర్మ సిద్ధాంతంతో వైసీపీని తుంగలో తొక్కాలంటే తాము గట్టిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ జగన్ నుంచీ తనకు, వైఎస్ సునీతకి ప్రాణహాని ఉందన్నారు. వైఎస్ జగన్ వంటి వారు అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వ నాశనం అవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమిని విచ్ఛిన్నం చేయాలని జగన్ కుట్రలు చేస్తూనే ఉన్నారన్నారు.

ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం.. కూటమి ఐక్యంగా ఉండాలని ఆదినారాయణ రెడ్డి అన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి బలోపేతం కావాలని పేర్కొన్నారు. కులమతాలు మధ్యలో వచ్చాయని.. కానీ మనమంతా ఒక్కటేనని ఆయన చెప్పుకొచ్చారు. కేవలం అభివృద్ధి మాత్రమే ప్రామాణికం కావాలన్నారు. తన మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే.. క్షమాపణలు తెలుపుతున్నానని చెప్పారు. తన ఉద్దేశం ఎవరినీ నొప్పించడం కాదని.. బీజేపీ ఎమ్మెల్యే వివరణ ఇచ్చారు. అంతకుముందు ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్‌తో ఎమ్మెల్యే ఆదినారాయణ సమావేశమయ్యారు. తిరుపతి బీజేపీ సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగతమని ఎమ్మెల్యే ఆదినారాయణ స్పష్టం చేశారు. తిరుపతి వేదికగా చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ వ్యాఖ్యలను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఖండించారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని వివరణ కోరతానంటూ పీవీఎన్ మాధవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి భేటీ అయ్యారు.

# డ్వాక్రా సంఘాలకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ : ఎమ్మెల్యే బోడే ప్రసాద్





**తాడిగడప, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** పెనమలూరు నియోజకవర్గం పోరంకి తెదేపా కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు , వారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడేలా, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో బ్యాటరీ సైకిళ్ల వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేలా కృషి చేస్తున్నామన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ 40 మంది డ్వాక్రా మహిళలకు బ్యాటరీ సైకిళ్లను అందచేశారు. రాష్ట్రంలో ఇంధన వాడకం తగ్గించేలా కాలుష్య రహిత వాతావరణం కల్పించేలా, ఆరోగ్యకరమైన వాతావరణం, వ్యాయామ సౌకర్యం పెంపొందించేలా ప్రజలకు, సమాజానికి ఉమ్మడి సౌకర్యం ఏర్పాటు ఉండేలా, ఇంధన వినియోగ రూపంలో ప్రజలు వెచ్చిస్తున్న ఖర్చును తగ్గించేలా, రూ.40,000/-లు విలువ చేసే, బ్యాటరీ సైకిళ్లను రూ.24,000/-లకే అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో రాష్ట్ర వ్యాప్తంగా బ్యాటరీ సైకిళ్ల వినియోగం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. డ్వాక్రా మహిళలు కాకుండా ఇతరులకు ఎవరికైనా బ్యాటరీ సైకిళ్ళ కావాలనుకుంటే రూ.24,000/-ల పూర్తి నగదు చెల్లింపు ద్వారా తక్షణ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి నాటికి ఆలయాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోండి: సీఎం చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, ఫిబ్రవరి 10: శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు(మంగళవారం) సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.

# మహాపాపానికి ఒడిగట్టిన జగన్: మంత్రి కొల్లు రవీంద్ర



క్రైం కౌంటర్ న్యూస్, మచిలీపట్నం, ఫిబ్రవరి 10: తిరుపతిలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం చేసి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మహాపాపానికి ఒడిగట్టాడని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై జగన్ అండ్ కో చేస్తున్న వ్యాఖ్యలపై కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బుకాయింపు మాటలు మానుకోండంటూ వారికి సూచించారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని ఒక బఫూన్‌లా మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరిగిందని ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) స్పష్టంగా చెబుతున్నా జగన్ అండ్ కో బుకాయించేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 2019లో నిబంధనలు సడలించడం వల్లే లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని సిట్ తన నివేదికలో స్పష్టం చేసిందని వివరించారు. ఒక వైపు మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కల్తీ జరిగిన మాట వాస్తవమే అని చెబుతున్నారని గుర్తు చేశారు. కానీ ఆ కల్తీ ఎలా జరిగిందో తనకు తెలియదంటూ తప్పించుకునే మాటలు మాట్లాడుతున్నారని వైవీ సుబ్బారెడ్డిపై కొల్లు రవీంద్ర నిప్పులు చెరిగారు.

వైసీపీకి చెందిన వైవీ సుబ్బారెడ్డే కల్తీ జరిగిందని చెబుతుంటే.. ఆ పార్టీ నేతలు మాత్రం బుకాయింపు మాటలు మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలు తిరుపతి నుంచి పంపలేదని పేర్ని నాని చెబుతున్నాడని.. అంటే తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని ఒప్పుకున్నట్టేగా అంటూ పేర్ని నానికి చురకలంటించారు. జగన్ చేతిలో కీలుబొమ్మల్లా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ధ్వజమేత్తారు. కలియుగ దైవంతో పెట్టుకున్న వారు గతంలో ఏమైపోయారో చూశామన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కి సైతం కలియుగ దైవం తప్పక శిక్ష వేస్తాడని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# కేంద్ర మంత్రి సీఆర్‌పాటిల్‌తో సీఎం చంద్రబాబు భేటీ..



క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సవివరంగా చర్చించారు ముఖ్యమంత్రి.

సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను(రాబో) శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-×× పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-××లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు.

గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు.గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కొల్లేరుపై త్వరలోనే సుప్రీం కోర్టుకు నివేదిక : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**కేంద్ర మంత్రి, జజుజ సభ్యులతో ఏలూరు ఎంపీ భేటీ...**
**సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి...**
**ఏలూరులో కోకో క్లస్టర్ అభివృద్ధికి చర్యలు...**
**త్వరలోనే ఏలూరు రైతాంగానికి శుభవార్తలు...**



ఏలూరు/ఢిల్లీ, ఫిబ్రవరి 10 (క్రైం కౌంటర్ ప్రతినిధి) : కొల్లేరు ఆక్వా రైతుల కష్టాలకు ముగింపు పలికే రోజు త్వరలోనే వస్తుందన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. మంగళవారం ఢిల్లీ లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను, కేంద్ర సాధికార కమిటీ (జజుజ) సభ్యుడు సీపీ గోయల్ ను కలిసిన ఎంపీ కొల్లేరు సమస్యపై చర్చించారు. చర్చల సారాంశాన్ని వీడియో ద్వారా మీడియాకు విడుదల చేశారు. లక్షలాది ఆక్వా రైతుల, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన కొల్లేరు సమస్యపై దృష్టి పెట్టాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రికి ఇచ్చిన లేఖలో కోరినట్లు ఎంపీ తెలిపారు. ఈ సమస్యపై ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులుహాఎన్.వి. రామరాజు ఇచ్చిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖకు జత చేశారు. కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల నిర్ణయంలో సుదీర్ఘ జాప్యం జరుగుతుండటం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖలో సుప్రీంకోర్టు ఆదేశాలు, అనంతరం కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని కేంద్ర సాధికార కమిటీ (జజుజ) సందర్శించిన అంశాలను ఎంపీ ప్రస్తావించారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిని మించి జజుజ రాష్ట్ర ప్రభుత్వాన్ని అదనపు సమాచారం కోరడం వల్ల మరిన్ని సంక్లిష్టతలు ఏర్పడటమే కాకుండా, కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల హేతుబద్ధీకరణపై జాతీయ వన్యప్రాణి మండలి ఇచ్చిన సూచనల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంపీ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా సమస్య పరిష్కరించని కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలోని తొమ్మిది మండలాల పరిధిలో 122 గ్రామాల్లో నివసిస్తున్న దాదాపు మూడు లక్షల మంది ప్రజలు వ్యవసాయం, మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ సమస్య వల్ల వారి జీవనోపాధి ప్రభావితమవుతోందని చెబుతూ సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా, అదే సమయంలో స్థానిక ప్రజల న్యాయసమ్మత హక్కులు, జీవనోపాధి కాపాడేలా కేంద్ర ప్రభుత్వం మానవీయ దృష్టితో జోక్యం చేసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ..., కేంద్ర మంత్రి, సీఈసీ సభ్యులు కొల్లేరు సమస్య పట్ల సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొద్ది రోజుల్లో సమాచారం సుప్రీం కోర్టు నియమించిన సాధికారిక కమిటీకి చేరుతుందని, అనంతరం నివేదిక తయారు చేసి సుప్రీం కోర్టుకు సమర్పిస్తామని వారు హామీ ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. కొల్లేరు రైతాంగానికి అనుకూలంగానే సుప్రీం కోర్టు తీర్పు వస్తుందనే అశాభావాన్ని ఎంపీ వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోనే ఎక్కువగా కోకో పంట సాగు చేస్తున్న ఏలూరు జిల్లాను కోకో హబ్ గా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, కోకో క్లస్టర్ ఏర్పాటుతో ఏలూరు జిల్లా కోకో ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మారబోతోందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

# అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు థ్యాంక్స్




క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి10: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఢిల్లీ పర్యటన మంగళవారం బిజీ బిజీగా సాగుతోంది. కేంద్ర మంత్రులతో ఆయన వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసి, కొత్త రైలు మార్గాలలో సర్వీసులను నడపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, చెన్నై - బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ల గురించి ఈ భేటీలో ప్రస్తావించారు చంద్రబాబు. అలాగే ఏపీ మీదుగా వెళ్లే మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడం పట్ల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఇక బెంగళూరు - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్.. తిరుపతిని అనుసంధానం చేసేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరారు సీఎం. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలని మంత్రిని కోరారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు.

దేశంలో ఉత్తర - దక్షిణ ప్రాంతాలను కలిపేలా ఇటార్సీ - విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలని అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్ - చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను అనుసంధానించేలా వివిధ కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు.

అదే విధంగా.. విశాఖ - విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ - కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి - చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ - శ్రీశైలం - మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైల పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుపతి మీదుగా విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలన్నారు. ఇక వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని అశ్వినీ వైష్ణవ్ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు.

# నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్.. సుజనా చౌదరి రియాక్షన్



క్రైం కౌంటర్ న్యూస్, విజయవాడ, ఫిబ్రవరి 10: తన నియోజకవర్గంలో 'నో దందా, నో చందా' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చెప్పారు. తన నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడంపై ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం స్పందించారు. ఈ నియోజకవర్గానికి తాను చేసింది తక్కువే అని.. చేయాల్సింది ఎక్కువే ఉందని తెలిపారు.

నియోజకవర్గంలో చందా.. దందా లేకుండా దాదాపుగా నియంత్రించామని విశ్వాసం వ్యక్తం చేశారు. ర్యాంకింగ్ అనేది ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలయ్యాయనే దాని మీద ఇచ్చారని ఎమ్మెల్యే సుజనా చౌదరి వివరించారు. ఎమ్మెల్యేగా తనకు కూడా ఫస్ట్ టైమ్ అని.. అలాగే నియోజకవర్గ ప్రజలంతా తనకు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. కూటమిలోని మూడు పార్టీల వారు కలిసి పని చేశారని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. తొలిసారిగా ఈ నియోజకవర్గంలో పర్యటించానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి గుర్తు చేశారు. ఆ తర్వాత నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూనే ఉన్నానని వివరించారు. ఈ నియోజకవర్గంలో తాను చేసింది 25 శాతం లేదా 30 శాతం మాత్రమేనని.. ఇంకా చేయాల్సింది 75 శాతం మిగిలి ఉందన్నారు. ఆ దిశగా పని చేస్తున్నట్లు తెలిపారు. ?ఎమ్మెల్యేగా అన్నీ మనమే చేయలేమని.. డెలిగేట్ ద్వారా పని చేయించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానం చేయడానికి ఎంత వీలు అయితే అంత చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉన్న పథకాలు తీసుకొని.. ఇంకా చాలా వరకు మెరుగుపరిచామని వివరించారు.

స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెంచాలనే దిశగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా తన ఫోకస్ ప్రివెంటివ్ సిక్నెస్ మీదనేనని చెప్పారు. ఆ ?తర్వాత ప్రెగ్నెంట్ ఉమెన్.. పని మానేసి హాస్పిటల్స్ వెళ్లకుండా మెటర్నిటీ సెంటర్స్ పెడితే ఇంకా ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో పాటు పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కోసం.. ఎన్జీవోస్‌తో మాట్లాడి ఐవోటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటివి ప్రవేశపెడతామన్నారు. ఆ తర్వాత మొబైల్ హెల్త్ వ్యాన్స్ పెట్టామని తెలిపారు. వీలైనంత వరకు తాను సుజనా ఫౌండేషన్ వారితో మాట్లాడానన్నారు. అందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భాగ్యనగర్ గ్యాస్ తదితర సంస్థలు సహకరించాయన్నారు. మిగిలిన ఫార్మా కంపెనీలతో కూడా తాను కాంటాక్ట్ చేస్తూ ఉన్నానని చెప్పారు.

ప్రజల సమస్యలపై అందుబాటులో ఉండటం కోసం 'సుజనా మిత్ర' పేరుతో ప్రతి డివిజన్‌లో ఒక కార్యాలయం ఏర్పాటు చేసి.. సిబ్బందిని నియమించామని వివరించారు. నేతలంతా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ పశ్చిమ నియోజకవర్గం మినీ ఇండియా అని అభివర్ణించారు. అందరూ కలిసికట్టుగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. అందువల్లే ఇదంతా చేయగలిగామన్నారు. భవిష్యత్తులో మరింత ఆదర్శంగా ఉండేలా ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు.


# సినిమా



## పవన్ కల్యాణ్ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షోకు వెళ్లి పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న టాలీవుడ్ హీరో.

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమా అంటే అభిమానుల హంగామా ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పోస్టర్స్, కటౌట్లు, పాలాభిషేకాలు, బాణసంచా.. అబ్బో థియేటర్ల ముందు ఓ రకమైన పండగ వాతావరణం ఉటుంది. ఇక ఒక్కోసారి అభిమానులను నియంత్రించేందుకు పోలీసులకు తమ లాఠీలకు కూడా పనిచెప్పాల్సి ఉంటుంది. 2013లో రిలీజైన అత్తారింటికి దారేది సినిమా ఎలాంటి సెన్సేషన్ సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సినిమా మొత్తం ఆన్ లైన్ లో లీకైనా ఈ మూవీ సంచలన విజయం సాధించింది. పవన సినిమాను థియేటర్లలో చూసేందుకు క్యూలు కట్టారు. కొన్ని చోట్ల ప్రేక్షకులను నియంత్రించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ లు కూడా చేశారు. అలా అప్పుడు పవన్ కల్యాణ్ సినిమాకు వెళ్లి పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్న వారిలో ఒక టాలీవుడ్ హీరో కూడా ఉన్నాడు. అతను మరెవరో కాదు సంతోష్ శోభన్. చాలా గ్యాప్ తర్వాత కపుల్ ఫ్రెండ్లీ అనే యూత్ ఫుల్ లవ్ స్టోరీతో మన ముందుకు వస్తున్నాడీ యంగ్ హీరో. మిస్ ఇండియా బ్యూటీ మానస వారణాసి ఇందులో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రస్తుతం తన సినిమా ప్రమోషన్లలో బిజీ బిజీగా ఉంటున్నాడు సంతోష్ శోభన్. వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తూ తన సినిమాను జనాల్లోకి తీసుకెళుతున్నాడు. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నాడీ ట్యా లెంటెడ్ హీరో. ఈ క్రమంలోనేఒక ఇంటర్వ్యూలో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పై ఆసక్తికర కామెంట్స్ చేశాడు సంతోష్. 'నేను పవన్ కల్యాణ్ కు వీరాభిమాని. అత్తారింటికి దారేది సినిమా విడుదల సమయంలో నాపై పోలీసు లాఠీ చార్జ్ కూడా జరిగింది. ఆ సినిమ ఫస్ట్ డే ఫస్ట్ షో నేను కూడా థియేటర్ కు వెళ్లాను. టిక్కెట్లు దొరక్కపోవడంతో కొందరు సినిమా థియేటర్ అద్దాలు పగలగొట్టారు. దీంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఆ సమయంలో నేను కూడా అక్కడే ఉన్నాను. పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్నాను. అలా పోలీసులతో దెబ్బలు తినడం అదే మొదటి, చివరిసారి కూడా' అని చెప్పుకొచ్చాడు సంతోష్ శోభన్. ప్రస్తుతం ఈ యంగ్ హీరో కామెంట్స్ నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ముఖ్యంగా పవన్ ఫ్యాన్స్ ఇందుకు సంబంధించిన వీడియోను తెగ వైరల్ చేసేస్తున్నారు.





## క్యారెట్లు తింటే కొలెస్ట్రాల్ తగ్గుతుందా?

మన శరీరానికి కొలెస్ట్రాల్ చాలా అవసరం. కానీ అది అధికమైతే తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. కానీ ఈ పెరిగిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి చాలా శ్రమ పడవల్సి వస్తుంది. అయితే మార్కెట్లో లభించే ఈ కూరగాయలను క్రమం తప్పకుండా తినడం వల్ల కొలెస్ట్రాల్ ఘననీయంగా తగ్గుతుంది. అవే కారెట్లు. శీతాకాలంలో సులభంగా లభించే క్యారెట్లు రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఒక వరం. క్యారెట్లను పోషకాల నిధిగా భావిస్తారు. క్యారెట్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. క్యారెట్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలను నయం చేయవచ్చు.

క్యారెట్ల అతిపెద్ద ప్రయోజనం కంటి చూపును మెరుగుపరచడం. వీటిలో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. విటమిన్ ఎ కళ్ళకు చాలా ముఖ్యమైనది. దృష్టి లోపం సమస్యను తగ్గిస్తుంది. అందుకే క్యారెట్లను కళ్ళకు ప్రయోజనకరంగా భావిస్తారు. దీనితో పాటు, జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో క్యారెట్లు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వాటిలోని ఫైబర్ మలబద్ధకం సమస్యను తొలగిస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఎల్లప్పుడూ గ్యాస్, అజీర్ణం లేదా మలబద్ధకంతో బాధపడేవారికి, క్యారెట్ తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

క్యారెట్లు గుండె ఆరోగ్యానికి కూడా మంచివి. వీటిలోని పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. క్యారెట్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చు. చర్మాన్ని అందంగా, ప్రకాశవంతంగా ఉంచడంలో క్యారెట్లు కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తాయి. దీనిలోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని లోపలి నుంచి పోషిస్తాయి. చర్మ ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యారెట్ రసం తాగడం వల్ల చర్మానికి సహజమైన మెరుపు వస్తుంది.క్యారెట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కూడా సహాయపడతాయి. దీని పోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇది జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. అంటే క్యారెట్‌లను సలాడ్, కూరగాయలు లేదా జ్యూస్ రూపంలో ఉపయోగించవచ్చు. శీతాకాలంలో ప్రతిరోజూ ఒకటి లేదా రెండు క్యారెట్‌లను పచ్చిగా లేదా జ్యూస్‌గా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అయితే ఎక్కువగా తీసుకోవడం వల్ల కొంతమందిలో చర్మం పసుపు రంగులోకి మారడం (కెరోటినీమియా) వంటి చిన్న దుష్ప్రభావాలు ఏర్పడతాయి. కాబట్టి సమతుల్య పరిమాణంలో తినడం మంచిది.



## కాలేయాన్ని కడిగిన ముత్యంలా మెరిపించే పండు ఇది.

పండ్లు కాలేయ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, పోషకాలతో సమృద్ధిగా ఉండే పండ్లు మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఆపిల్స్, కాలేయాన్ని నిర్విషీకరణ చేయడానికి, విషాన్ని తొలగించడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవి కాలేయం నుంచి మలినాలను తొలగించడానికి, వాపును తగ్గించడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడతాయి. యాపిల్‌లోని పెక్టిన్, ఫైబర్ కాలేయాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. ఇది శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది కాలేయంపై ఒత్తిడిని తగ్గిస్తుంది.

యాపిల్స్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వాటిలో ఉండే ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేయడంలో యాపిల్స్ ఉపయోగకరంగా భావిస్తారు. యాపిల్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. యాపిల్స్ లో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, అవి ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. దీంతో తరచుగా వచ్చే ఆకలిని నివారిస్తుంది. బరువు నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. యాపిల్‌లోని విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇవి సాధారణ ఇన్ఫెక్షన్లను నివారించడంలో, శరీరాన్ని చురుగ్గా ఉంచడంలో సహాయపడతాయి. యాపిల్‌లోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి చర్మాన్ని పోషిస్తాయి. దాని ప్రకాశాన్ని పెంచుతాయి. అకాల చర్మ ముడతలను నివారిస్తాయి.

## టీమిండియాకు మరో బ్యాడ్‌న్యూస్.

నమీబియాతో జరిగే మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ పాల్గొనడంపై అనుమానాలు మొదలయ్యాయి. ఓనివేదికల ప్రకారం, అభిషేక్ శర్మ అనారోగ్యంతో బాధపడుతున్న్ను. ఢిల్లీలో టీం ఇండియాతో ప్రాక్టీస్ చేసేందుకు రాలేదు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆటగాళ్లందరూ ప్రాక్టీస్ చేశారు. కానీ అభిషేక్ ఆ గ్రూప్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ కడుపు సమస్యతో బాధపడుతున్నాడని, అందువల్ల ప్రాక్టీస్ చేయలేకపోతున్నాడని నివేదికలు సూచిస్తున్నాయి. భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ కూడా ఈ విషయంపై కీలక అప్డేట్ అందించాడు.

అభిషేక్ శర్మ ఆడటంపై సందిగ్ధం..?

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన టెండెస్కతే, ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నాయని, నమీబియాతో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నానని తెలిపాడు. టీం ఇండియా అసిస్టెంట్ కోచ్ ప్రకటన ప్రకారం అభిషేక్ శర్మ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నాడని, రెండవ మ్యాచ్‌లో అతను పాల్గొనడం సందిగ్ధం నెలకొంది. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో మొదటి బంతికే ఔటవడం ద్వారా అభిషేక్ శర్మ మొదటి మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు.

సంజు సామ్సన్ కు లక్కీ ఛాన్స్..?

నమీబియాతో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడకపోతే, సంజు సామ్సన్ తిరిగి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి రావొచ్చు. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 12న జరుగుతుంది. సంజు, ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చు. మొదటి మ్యాచ్‌లో సంజు సామ్సన్‌కు అవకాశం రాలేదు. ఇషాన్ కిషన్ అద్భుతమైన ఫామ్ కారణంగా అతను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పుకున్నాడు. అయితే, అభిషేక్ లేనప్పుడు సంజూకు అవకాశం లభించవచ్చు.

బుమ్రా రీఎంట్రీ..

అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్ కు దూరమైన జస్ప్రీత్ బుమ్రా రెండవ మ్యాచ్ కు తిరిగి రానున్నాడు. ఢిల్లీలో జరిగిన ప్రాక్టీస్ సెషన్ లో ఆటగాడు ఫిట్ గా కనిపించాడు. ప్రశ్న ఏమిటంటే, బుమ్రా ఫిట్ గా ఉంటే సిరాజ్ ను ఆడిస్తారా లేదా అనేది చూడలి. సిరాజ్ మొదటి మ్యాచ్ లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన సంగతి తెలిసిందే. మరి సిరాజ్ ను తప్పించే సాహసం చేస్తారా అనేది చూడాలి. టీం ఇండియాకు మరో శుభవార్త ఏమిటంటే వాషింగ్టన్ సుందర్ జట్టులోకి వచ్చాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో ఈ ఆటగాడు సైడ్ స్ట్రెయిన్ తో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు పూర్తిగా ఫిట్ గా మారాడు.




## గర్ల్ ఫ్రెండ్‌కే కాదు, ఫ్యామిలీకి నో ఎంట్రీ..

ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ సమయంలో ఆటగాళ్లను వారి కుటుంబాలతో ఉండనివ్వకూడదనే ప్రస్తుత విధానానికే కట్టుబడి ఉండాలని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు నిర్ణయించింది. టీం ఇండియా ఆటగాళ్లు అభ్యర్థనలు చేసినా.. బీసీసీఐ మాత్రం ఒప్పుకోలేదు. ప్రధాన టోర్నమెంట్ల కోసం ఇప్పటికే అమలులో ఉన్న మార్గదర్శకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సవరించకూడదని బోర్డు నిర్ణయించింది. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ ల రిక్వెస్ కూడా ఒప్పుకోలేదంట. ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ లో భారత జట్టు 1-3 తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన తర్వాత విదేశీ పర్యటనలతోపాటు, కీలక టోర్నమెంట్ల సమయంలో ఫ్యామిలీతో కలిసి ఉండడంపై బీసీసీఐ కఠినమైన నియమాలను జారీ చేసింది. అధికారిక విధానం ప్రకారం, ఆటగాళ్ళు తమ కుటుంబాలను 14 రోజుల వరకు తమతో తీసుకెళ్లడానికి అనుమతి ఉంది. అయితే పర్యటన 45 రోజుల కంటే ఎక్కువ కాలం ఉంటుంది.

2026 టీ20 ప్రపంచ కప్ సందర్భంగా ఆటగాళ్ల అభ్యర్థనను తిరస్కరించిన బీసీసీఐ.. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, ఆటగాళ్ల భార్యలు లేదా కాబోయే భార్యలు జట్టుతో ప్రయాణించి వారితో ఉండవచ్చా అనే దానిపై బీసీసీఐ నుంచి వివరణ కోరింది. ఈ క్రమంలో బీసీసీఐ ఈ అభ్యర్థనను తిరస్కరించింది. కుటుంబ సభ్యులను ఆటగాళ్లతో ఉండటానికి అనుమతించబోమని పేర్కొంది.

టీమిండియా షెడ్యూల్..

ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై 29 పరుగుల తేడాతో భారత్ తమ టీ20 ప్రపంచ కప్ 2026 ప్రచారాన్ని ప్రారంభించింది. మార్చి 8న భారత్ ఫైనల్‌కు చేరుకుంటే టీమిండియా ఆటగాళ్ల షెడ్యూల్ ఒక నెల కంటే కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. కుటుంబ సభ్యులతో గడపడానికి బీసీసీఐ నిర్దేశించింది కేవలం 14 రోజులే. దీంతో ఆటగాళ్లు బీసీసీఐని అభ్యర్థించారు. కానీ ఇందుకు బోర్ట్ ఏమాత్రం ఒప్పుకోలేదు.

తొలి విజయం తర్వాత, జట్టు ముంబై నుంచి ఢిల్లీకి ప్రయాణించింది. ఇప్పుడు ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో జరిగే గ్రూప్-స్టేజ్ మ్యాచ్ కోసం శ్రీలంకకు వెళ్లనుంది. ఆ తర్వాత తమ చివరి గ్రూప్ మ్యాచ్ కోసం భారతదేశానికి తిరిగి రానుంది.

మెన్ ఇన్ బ్లూ సూపర్ 8, నాకౌట్ దశలకు చేరుకుంటే, ఈ ప్రయాణం మరింత పెరగనుంది. ప్రపంచ కప్‌నకు ముందు భారత జట్టు అనేక ద్వైపాక్షిక సిరీస్‌లను కూడా ఆడింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులను జట్టుతో ఉండటానికి అనుమతించలేదు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com